# పనిచేసే వారికే పట్టం కట్టండి

- కాంగ్రెస్ మాటమీద నిలబడే పార్టీ కాదు
- ఆ పార్టీ మాయమాటలను నమ్మొద్దు
- గల్ఫ్‌కు వెళ్లినవారి పేర్లను రేషన్ కార్డుల్లోంచి తొలగించే నిబంధన ఎత్తివేస్తాం
- నియోజవర్గాన్ని అభివృద్ధి చేశా..మరోసారి గెలిపించండి
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ మండలాల్లో ఎంపీ సురేశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం


కోనాసముందర్‌లో వేములకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కమ్మర్‌పల్లి, నవంబర్ 21 : ప్రజల కోసం పనిచేసేవారికే ఓటు వేయాలని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ మాట మీద నిలబడే పార్టీ కాదన్నారు. మంగళవారం ఉదయం ఆయన కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్, కేసీ తండా, కోనాసముందర్‌లో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం భీమ్‌గల్ మండలం చేంగల్, మెండోరా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వేముల మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో తెలంగాణను ఇస్తున్నట్లు ప్రకటించి, 24 గంటల్లోనే వెనక్కి తీసుకొని ఎందరో ఆత్మ బలి దానాలకు కాంగ్రెస్ పార్టీ కారణమైందని గుర్తుచేశారు. ఆ పార్టీ మాట మీద నిలబడే పార్టీ కాదనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అంతపెద్ద విషయంలోనే మాట తప్పిన పార్టీ చిన్న చిన్న విషయాల పట్ల ఎలా ఉంటుందో ఊహించవచ్చన్నారు. కొత్తగా బీడీ పీఎఫ్ వచ్చిన వారికి పింఛన్ మంజూరు చేయాలంటే సీఎం కేసీఆర్ చేతిలో పని అని తెలిపారు. అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఢిల్లీలో సోనియాగాంధీ ఒప్పుకుంటే తప్ప ఇక్కడ ఆ పార్టీ నాయకులు చేసేదేమీ ఉండదన్నారు. తాను సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా విన్నవించి మంజూరు చేయించిన సంఘ భవనాలు ప్రొసీడింగ్‌లు వట్టి కాగితాలని దిగచారుడు ప్రచారం చేస్తున్న వ్యక్తి ఒక సన్నాసి అని విమర్శించారు. ఆ ప్రొసీడింగ్‌లతో ఇప్పటికిప్పుడు కూడా నిర్మాణాలు ప్రారంభించుకోవచ్చని స్పష్టం చేశారు. వారు చేసిన అభివృద్ధి ఏమీ లేక ప్రతిపక్ష నాయకులు తనపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వద్దకు వచ్చిన వారి సమస్యలను పరిష్కరించి కడుపు నిండా భోజనం పెట్టి మరీ పంపిస్తానని, కానీ ఎవ్వరి వద్ద రూపాయి ఆశించే చరిత్ర తనది కాదన్నారు. తనపై ఆరోపణలు చేసిన ప్రతి పక్షాలకు ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గల్ఫ్‌కు వెళ్లినవారి పేర్లు రేషన్ కార్డుల్లోంచి తొలగించే నిబంధనను ఎత్తివేసే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత కరెంట్ ఎలా ఉండేదో.. ఇప్పుడు ఎలా ఉందో గమనించాలని ప్రజలకు సూచించారు. గట్టు పొడిచిన వాగు ప్రాజెక్టు నీళ్లు గుంటగుంటకూ అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల్లో ప్రజలు కొత్తగా అడిగిన పలు పనులను తప్పకుండా చేస్తానని మాటిచ్చారు.


కోనాపూర్‌లో మాట్లాడుతున్న వేముల

**తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష: ఎంపీ సురేశ్‌రెడ్డి**

ఎంపీ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉండే కేసీఆర్, మన పక్కనే ఉండే ప్రశాంత్ రెడ్డిని కాదని ఢిల్లీ పార్టీలను తెచ్చి పెట్టుకుంటే మళ్లీ కష్టాల్లో పడతామన్నారు. సరిహద్దులో సైనికుడిలా ఉన్న కేసీఆరే తెలంగాణకు శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఇచ్చినట్లు ప్రకటించి వెనక్కి తీసుకోవడంతో ఎందరో బలిదానాలకు కారణమైందన్నారు. ఇదే విషయమై ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన చిదంబరం క్షమాపణ చెప్పిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఆయన మాటలు కాంగ్రెస్ పార్టీ స్థిర నిర్ణయాలు చేయ జాలదని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. మంత్రికి ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చేంగల్‌లో వేములపై పూలవర్షం కురిపిస్తున్న గ్రామస్తులు

**చేంగల్,మెండోరా గ్రామాల్లో ఘన స్వాగతం**

భీమ్‌గల్, నవంబర్ 21 :మండలంలోని చేంగల్, మెండోరా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారానికి వచ్చిన వేముల ప్రశాంత్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బోనాలు, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. మంగళహారతులు పడుతూ మంత్రిపై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**నేడు మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో వేముల ప్రచారం**

వేల్పూర్, నవంబర్ 21 : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు వేల్పూర్ మండలం పడిగెల్ వడ్డెర కాలనీ, 10 గంటలకు మోర్తాడ్ మండలం దొన్కల్‌లోని సంతోష్‌నగర్ తండా, 11 గంటలకు ఏర్గట్ల మండలం తొర్తి, 12 గంటలకు కమ్మర్‌పల్లి మండలం ఆర్ఆర్ నగర్, సాయంత్రం 4.30 గంటలకు కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్, 6 గంటలకు మోర్తాడ్ మండలం వడ్యాట్, సాయంత్రం 7.30 గంటలకు వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో ప్రచారంలో పాల్గొంటారు.

## బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం


భీమ్‌గల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వేముల సతీమణి నీరజారెడ్డి, కుటుంబ సభ్యులు

మోర్తాడ్, నవంబర్ 21: బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మోర్తాడ్ మండలంలో బీఆర్ఎస్ ప్రచారం రోజురోజుకూ పుంజుకుంటున్నది. మంగళవారం ప్రాంతాలవారీగా ఇంటింటికీ తిరుగుతూ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుగుర్తుకు ఓటు వేసి మంత్రి ప్రశాంత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

**భీమ్‌గల్‌లో వేముల సతీమణి ప్రచారం**

భీమ్‌గల్,నవంబర్ 21: భీమ్‌గల్ పట్టణంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒకటో వార్డులో ఇంటింటికీ తిరిగి బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి వేములను మరోసారి గెలిపించాలని కోరారు.

## గ్రామాల్లో ఓటరు స్లిప్పుల పంపిణీ

బాల్కొండ, నవంబర్ 21 : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు స్లిప్పులను అధికారులు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం బీఎల్వోలు, రెవెన్యూ, అంగనవాడీ టీచర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్లిప్పులను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త మాధవి, వీవోఏ రాజమణి పాల్గొన్నారు.


బాల్కొండలో స్లిప్పులను అందజేస్తున్న బీఎల్వోలు

## మంత్రి వేములకు ఏర్గట్ల విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

**స్థానిక ప్రజాప్రతినిధులకు ఏకగ్రీవ తీర్మాన పత్రం అందజేత**


ఏర్గట్లలో స్థానిక ప్రజాప్రతినిధులకు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

ఏర్గట్ల, నవంబర్ 21 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏర్గట్లలోని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు (63 కుటుంబాలు) ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన కాపీని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందానికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. మంత్రి వేముల ఏర్గట్ల గ్రామాన్ని మండల కేంద్రంగా మార్చడమే గాకుండా రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, బీటీరోడ్డుతోపాటు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. కుల సంఘ భవనాలు, ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎస్ చెక్కుల మంజూరు, యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్సులు అందజేసి పార్టీల కతీతంగా ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సంఘం అధ్యక్షుడు రాజరాపు నరేశ్, అక్కునూరి లక్ష్మీ కాంత్, రాగి నారాయణ, సనుగుల రమేశ్, పరికిపండ్ల శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం మండల అధ్యక్షుడు వడ్ల గంగాధర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గొడ్డలితో దాడి కేసులో ఒకరికి ఐదేండ్ల జైలుశిక్ష

మోర్తాడ్, నవంబర్ 21: ఇద్దరిపై గొడ్డలితో దాడిచేసిన కేసులో మండలంలోని రామన్నపేట్ గ్రామానికి చెందిన గౌరిసంజీవ్ అనే వ్యక్తికి ఐదేండ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ఆర్మూర్ సబ్‌కోర్టు జడ్జి నసీమ్‌సుల్తానా తీర్పు చెప్పినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట్ గ్రామానికి చెందిన రాజారాపు అశోక్ భార్యతో సంజీవ్‌కు వివాహేతర సంబంధం ఉండగా.. ఇదే విషయంలో అశోక్, సంజీవ్ మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2018 అక్టోబర్ పదో తేది రా త్రి అశోక్‌తోపాటు ఆయన తమ్ముడు రమేశ్‌పై సంజీవ్ గొడ్డలితో దాడి చేశాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. తగిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు సంజీవ్‌కు ఐదేండ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.